నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 30 మార్చి 2025 | VIKARABAD

## నాలుగు నెలలుగా అందని జీతాలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికులకు కొన్ని నెలలుగా జీతాలు రాకపోవడంతో వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం గ్రామాలను స్వచ్ఛంగా మార్చేందుకు పల్లెప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందుకోసం గ్రామాల్లో పంచాయతీ సిబ్బందిని నియమించింది. అప్పట్లో వారికి ప్రతినెలా సక్రమంగా జీతాలు అందడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండే. కానీ, ప్రస్తుత రేవంత్ సర్కార్‌లో గత నాలుగు నెలలుగా జీతాలు అందక పూట గడవడమే కష్టంగా మా రిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పండుగకూ పస్తులుండాల్సిన పరిస్థితే వచ్చిందని వాపోతున్నారు.



## మాజీ మంత్రిని కలిసిన నూతనంగా నియమితులైన అధ్యక్షులు

మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో నూతనంగా నియమితులైన పట్టణ, మండలాల అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె గోపాల్ ముదిరాజ్, మల్లికార్జున్, మహిపాల్‌రెడ్డి, అశోక్, శివకుమార్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని.. ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వారితోపాటు సీనియర్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. **-వికారాబాద్, మార్చి 29**

### కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో..

# ఉత్సాహం కరువైన ఉగాది

- రంగారెడ్డి జిల్లాలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదు
- ఉగాది పండుగకు ఆసక్తి చూపని జిల్లాలోని రైతులు, పంచాయతీ కార్మికులు, మాజీ సర్పంచ్‌లు, ఆశ వర్కర్లు



కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేకపోవడంతో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను రంగారెడ్డి జిల్లాలోని ప్రజలు జరుపుకొనేందుకు ఆసక్తి, ఉత్సాహం చూపడం లేదు. గత పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంతో ప్రజలు ఎంతో సంతోషంగా పండుగలు నిర్వహించుకున్నారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. రైతులు, మహిళలు, యువకులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల వారు నిరుత్సాహంగా ఉన్నారు.

అడుగంటిన భూగర్భజలాలతో బోరుబావుల్లో నీరులేక ఎండిపోతున్న పంటలను చూసి కన్నీరు పెట్టుకుంటున్న అన్నదాత ఒకవైపు అయితే.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినా బిల్లులు రాక అవస్థలు పడుతున్న మాజీ సర్పంచ్‌లు మరోవైపు .. వేతనాలందక జీపీ కార్మికులు.. వేతనాలు పెంచాలని ఆశ వర్కర్ల నిరసనలు.. డీఏలు అందక ఉపాధ్యాయ, ఉద్యోగులు, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రాక ఎదురుచూస్తున్న ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక విద్యార్థుల వెతలు.. స్వయం సహాయ సంఘాలకు రుణాలు రాక మహిళలు.. వీరితో పాటు అనేక వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఉగాది పండుగను ఏలా చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదని పేర్కొంటున్నారు.

**-షాబాద్, మార్చి 29**



నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేస్తున్న పోలీసులు(ఫైల్)

## అన్నదాత అరిగోస..

ఆరుగాలం కష్టపడి పంటలు పండించే అన్నదాత అరిగోస పడుతున్నాడు. అడుగంటుతున్న భూగర్భ జలాలతో బోరుబావుల్లో చుక్క నీరు లేకుండా పోతున్నది. దీంతో వాటి కింద సాగు చేసి న పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే రైతన్న కన్నీరుము న్నీరు అవుతున్నాడు. గత కేసీఆర్ హయాంలో మిషన్ కాకతీయ పథకం ద్వారా ఏండ్ల తరబడి మరమ్మతులకు నోచుకోని చెరువులను పూడిక తీయడంతో భారీ వర్షాలకు చెరువులు నిం డి అలుగులు పారాయి. దీంతో బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో అన్నదాతలు సంతోషంగా పంటలు పండించుకున్నారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ చెరువులు, కాల్వలను పట్టించుకోవడం లేదు. చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో అవి నీరు లేక ఎండిపోతున్నాయి. తద్వారా బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోయి అన్నదాతలు వేసిన పంట లు ఎండిపోతున్నాయి. అంతేకాకుండా రైతుభరోసా పెట్టుబడి సాయం అందక కొందరు.. రుణమాఫీ కాక మరికొంతమంది రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రతి ఏడాది ఉగాది పండుగకు రైతులు కొత్త అరకలను తయారు చేసి పూజలు చేసి వ్యవసాయ పనులు ప్రారంభించేవారు. ఈ ఏడాది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారడంతో ఆ ఉత్సాహం ఎక్కడా కనిపించడం లేదు.

## బిల్లులు రాక మాజీ సర్పంచుల తిప్పలు..

రూ. లక్షలు అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులను మాజీ సర్పంచ్‌లు చేపట్టగా.. ఆ బిల్లులు రాకపోవడంతో వారు అనేక తిప్పలు పడుతున్నారు. కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి 16 నెలలు గడుస్తున్నా సర్పంచులకు పెండింగ్ బిల్లులను ఇంకా చెల్లించలేదు. బిల్లులు చెల్లించి ఆదుకోండి మహాప్రభో.. అంటూ మాజీ ప్రజాప్రతినిధులు నగరంలో ధర్నాకు తరలితే ప్రభుత్వం ఎక్కడిక్కడ పోలీసులతో అరెస్టులు చేయించి నిర్బంధి స్తున్నదని మండిపడుతున్నారు. అప్పులు చేసి అభివృద్ధి పనులను చేపట్టామని.. వాటికి వడ్డీలు చెల్లించలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీల్లో రూ. లక్షల్లో బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు మాజీ సర్పంచులు వాపోతున్నారు.

## ఆశ వర్కర్ల ఆశలు ఆవిరి

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ అమలు చేయకపోవడంతో ఆశ వర్కర్ల ఆశలు ఆవిరయ్యాయి. ఆశ వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పవర్‌లోకి రాగానే చేతులెత్తేయడంతో వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. తమ సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏమైనా నిరసన కార్యక్రమాలు చేపడితే ప్రభుత్వం పోలీసులతో ఎక్కడికక్కడ అరెస్టులు చేయించి అడ్డుకుంటున్నదని మండిపడ్డారు.



నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లను లాక్కెళ్తున్న పోలీసులు (ఫైల్)

### రైతులకు అన్నీ కష్టాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంకా రైతులకు అన్నీ కష్టాలే మొదలయ్యాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుబావుల్లో నీరు లేకుండా పోయి.. వేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయి. ఆరుగా లం కష్టపడి సాగు చేసిన పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే కన్నీళ్లు వస్తున్నాయి. ప్రభుత్వం రైతుభరోసా పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయకున్నా.. అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేశారు. కేసీఆర్ హయాంలోనే అన్నదాతలు సంతోషంగా ఉన్నారు. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలే..

**-కుమార్‌యాదవ్, రైతు కుమ్మరిగూడ, షాబాద్ మండలం**

### జీతాలు రాకుంటే పండుగెట్ల చేసుకునేది..



గత నాలుగు నెలలుగా జీతాలే రావడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం ఉండడం లేదు. ఈ ప్రభుత్వం లో పంచాయతీ కార్మికుల బతుకులు రోజురోజుకూ దిగజారుతున్నాయి. బతకడమే భారంగా మారగా.. పండుగను ఎలా జరుపుకోవాలి.

**-గడ్డమీది లక్ష్మయ్య, జీపీ కార్మికుడు, తాళ్లపల్లి, షాబాద్**

### సమస్యల పరిష్కారంలో విఫలం

అధికారంలోకి రాక ముందు అనేక హామీలిచ్చి.. గద్దెనెక్కగానే వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. గ్రామ పంచాయతీ కార్మికులు వేతనాలందక ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశ వర్కర్లు కోరుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ధర్నాలకు దిగితే ఎక్కడిక్కడ పోలీసులతో ప్రభుత్వం అరెస్టులు చేయించడం దారుణం. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికులు సంతోషంగా పండుగను ఎలా జరుపుకొంటారు. ప్రస్తుతం పండుగకు పస్తులుండాల్సిన పరిస్థితే నెలకొన్నది. ప్రభుత్వం వెంటనే స్పందించి జీపీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలి.



**-అల్లి దేవేందర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి**

### బిల్లులు రాక తిప్పలు..



గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా రాకపోవ డంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా. గ్రామంలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతోపాటు పలు పనులను చేపట్టా. రెండేండ్లు దాటుతున్నా ఇప్పటికీ డబ్బులు రాలేదు. అధికారులను అడిగితే మా చేతుల్లో ఏమి లేదని చెబుతున్నారు. అప్పులు చేసి పనులు చేపట్టగా.. వాటికి వడ్డీలు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. మమ్మల్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

**-కుమ్మరి దర్శన్, మాజీ సర్పంచ్ సంకెపల్లిగూడ, షాబాద్**



రామోజీ ఫిలింసిటీలో ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య తదితరులు

### రామోజీ ఫిలింసిటీలో

## ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

**రంగారెడ్డి కలెక్టర్‌కు సీపీఎం ఇంటి స్థలాల పోరాట కమిటీ బృందం వినతి**

ఆదిబట్ల, మార్చి 29 : ఇబ్రహీంపట్నం మండలం, నాగన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 189, 203లో నిరుపేదలకు ఇచ్చిన 60 గజాల ఇంటి స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని శనివారం సీపీఎం ఇంటి స్థలాల పోరాట కమిటీ బృందం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. 18 ఏండ్లుగా రామోజీఫిలింసిటీలో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల కోసం పోరాడుతున్నామని తెలిపారు. ఇటీవల చలో రామోజీ ఫిలింసిటీ కార్యక్రమం సందర్భంగా ఇండ్ల స్థలాల వద్దకు లబ్ధిదారులు వెళ్తే వారిని పోలీసులు ఈడ్చుకెళ్లారని, అకారణంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాలను తమకు ఇవ్వాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతోనే లబ్ధిదారులు అక్కడికి వెళ్లాల్సి వచ్చిందన్నారు. పేదల ఇండ్లస్థలాలను రామోజీ యాజమాన్యం అక్రమంగా కబ్జాచేసి వినియోగించుకుంటున్నదని.. అందులోకి ఎవ్వరూ వెళ్లకుండా కందకాలు తీయడంతోపాటు రోడ్డును నిర్మించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు కేటాయించిన ఇండ్ల స్థలాలను వెంటనే ఇప్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. రామోజీ ఫిలింసిటీలోని ఇండ్ల స్థలాల విషయంపై ప్రభుత్వానికి నివేదికను పంపించామని.. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సామేల్, జిల్లా కమిటీ సభ్యులు బుగ్గరాములు, జంగయ్య, జగన్, మండల కమిటీ సభ్యులు ఆనంద్, నర్సింహ, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, కృష్ణ, శ్రీనివాస్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

### భూసేకరణలో అభ్యంతరాలపై

# 3 నుంచి విచారణ

- బాధిత రైతులతో చర్చించి ఒప్పించేందుకు అధికారుల చర్యలు
- అప్పటికీ భూములిచ్చేందుకు ముందుకు రాకపోతే నోటీసుల జారీ

**పరిహారం విషయాన్ని తేల్చకుండానే టెండర్లు పిలువడంపై రైతన్నల ఆగ్రహం**

రంగారెడ్డి, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : ఫ్యూచర్‌సిటీ ఏర్పాటు కోసం ప్రధానమైన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తున్నది. రైతులు ఎన్ని అభ్యంతరాలు తెలిపినా భూసేకరణకే ప్రభుత్వం మొగ్గు చూపింది. రైతుల అభ్యంతరాలపై ఏప్రిల్ 3 నుంచి విచారణ చేపట్టి వారితో చర్చించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విచారణ జరిపిన తర్వాత కూడా రైతులు భూమి ఇచ్చేందుకు ముందుకు రాకపోతే వారికి నోటీసులిచ్చి భూమిని సేకరించాలని నిర్ణయించారు. జిల్లాలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీని ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఫ్యూచర్‌సిటీకి ప్రధానమైన గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును 330 అడుగుల వెడల్పుతో సుమారు 42 కిలోమీటర్ల మేర నిర్మించాలని నిర్ణయించింది. ఫేస్–1లో కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు సుమారు 19 కిలోమీటర్లు వేయనున్నారు. ఫేస్–2లో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమనగల్లు మండలంలోని ఆకుతోటపల్లి వరకు సుమారు 22 కిలోమీటర్ల మేర 300 అడుగుల వెడల్పుతో వేయనున్నారు. అందుకోసం 449 ఎకరాలను గుర్తించారు. ఫేస్–1, ఫేస్–2 రోడ్డు నిర్మాణంతో 4,725 మంది తమ భూములను కోల్పోనున్నారు. కాగా భూసేకరణ విషయంలో రైతులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నా ప్రభుత్వం పోలీసుల సహకారంతో భూములను సేకరించడంతోపాటు హద్దురాళ్లను ఏర్పాటు చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ భూములను ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెబుతున్నా..ప్రభుత్వం మాత్రం ముందుకే సాగుతున్నది.




### మొదటి విడతలో ఫేస్-1 భూసేకరణపై..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకోసం మొదటి విడుతలో కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ నుంచి కొంగరకుర్దు, ఫిరోజ్‌గూడ, కొంగరకలాన్, లేమూర్, తిమ్మాపూర్, రాచులూరు, గుమ్మడవెల్లి, పంజాగూడ మీదుగా మీర్‌ఖాన్‌పేట వరకు భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను విచారించాలని అధికారులు నిర్ణయించారు. ఈ విచారణలో భూసేకరణకు రైతులను ఒప్పించేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. రైతులను ఒప్పించి పరిహారం విషయంలో వారి అభిప్రాయాలకు ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. కాగా, రైతులు భూమికి భూమి ఇవ్వాలని లేదా మార్కెట్‌ధర ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు ఏ డిమాండ్‌ను అంగీకరిస్తారనేది తేలాల్సి ఉన్నది. అలాగే, ఫేస్–2లో మీర్‌ఖాన్‌పేట నుంచి కుర్మిద్ద, ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట, కడ్తాల్, ఆమనగల్లు మీదుగా ఆకుతోటపల్లి వరకు భూమిని సేకరించనున్నా రు. ఫేస్–1లో 14 గ్రామాల నుంచి రోడ్డు వెళ్లనున్నది.

### రైతుల అభిప్రాయాలు, డిమాండ్లు తెలుసుకుంటాం

గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి చేపట్టిన భూసేకరణలో వచ్చిన అభ్యంతరాలపై వచ్చే నెల మూడో తేదీ నుంచి విచారణ జరుపుతాం. ముందుగా ఫేస్–1 తర్వాత ఫేస్–2లో వచ్చిన అభ్యంతరాలను రైతులతో చర్చించి వారి అభిప్రాయాలు, డిమాండ్లను తెలుసుకుని.. దానికి అనుగుణంగా ముందుకెళ్తాం.

**-రాజు, భూసేకరణ అధికారి, రంగారెడ్డి జిల్లా**

### పరిహారం తేల్చకుండానే టెండర్లు..

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం విషయాన్ని తేల్చకుండానే టెండర్ల కోసం అధికారులు దరఖాస్తులు కోరారు. నష్టపరిహారం విషయాన్ని తేల్చకుండానే టెండర్లను ఆహ్వానించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రైతులు ఎన్ని అభ్యంతరాలు సృష్టించినా ప్రభుత్వం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం వెయ్యి ఎకరాలను సేకరించడమే ధ్యేయంగా పెట్టుకున్నది.